**శోభ వెళ్ళిపోతుంది. సూట్ కేస్ లో గుడ్డలు సర్దుకుంది. ఇంటికంతా శోభగా తిరిగింది. ఇప్పుడు ఇంటికి 'శోభ' శూన్యం కాబోతుంది!**

అమ్మ మాట్లాడటం లేదు!

నాన్న శిలా ప్రతిమలా కదలటంలేదు!

అవును-వారికి శోభ అవసరం లేదు.

అందుకే శోభ వెళ్ళిపోతుంది.

ఈ ఇల్లు పూలులేని పొదలా అయిపోతుంది. నల్లని రాత్రిలా కనిపిస్తుంది. ఆనందపు అంచులు లేని సముద్రంలా. భయంగా. వివిలంగా అర్థంతెలీని లోతుల్లోకి వెళ్ళిపోతుంది. చుక్కలు లేని ఆకాశంలా అనురాగాలు ముగలని అనంతాల్లోకి జారిపోతుంది.

రంగులేని చీరె కట్టుకుంది శోభ-

తలలో పూలు లేవు—

ముఖానికెంతో అందంగా కనిపించే బొట్టు నొసలు మీద ఎర్రగా ప్రకాశించటం లేదు—

అవును—

ఆమె ముఖం—

ఎర్రని సూర్యబింబాన్ని కోల్పోయిన సాయం సంధ్యలా ఆశ్చర్యంగా మారిపోయింది! ఆవేదనగా మారిపోయింది.

అయినా ఆమె భూమిలా సహనంగా వుంది.

కళ్ళు ఎర్రగా వున్నాయి. అగ్నిపర్వతాలు ప్రక్కలావాలా ఆమె కళ్ళల్లోంచి నీటిబిందువులు మెల్లిగా జారుతున్నాయి.

ఆమె తండ్రి వరండాలో నిలబడ్డాడు. పరిస్థితుల యజమాని కసిగా వేసిన బరువుపడ్డ అల్పజీవిగా అదిరిపోతున్నాడు. శూన్యం పైపుకి చూస్తున్నాడు.

బాబ్జీ నిద్రపోతున్నాడు.

వాడికి మెలకువ వచ్చేలోపు శోభ వెళ్ళిపోతుంది!

బాబ్జీ నిద్రలేవటంతోనే "అమ్మా" అంటాడు. పోయిన అమ్మను గురించి-ఉన్న తన అమ్మ ఏం సమాధానం చెప్తుందో. ఎన్ని అబద్ధాలు చెప్తుందో....! ఎన్ని రకాలుగా మాట్లాడుతుందో....! పండిన జీవితంలో నేర్చుకున్న పిట్ట కథలన్నీ వల్లిస్తుంది. కనిపించని శోభ గుట్టుకథలన్నీ దాచేస్తుంది.



బహుశా అమ్మ ఇప్పుడు—

వెళ్ళిపోయే శోభను గురించి కాక. నిద్రలేవబోయే బాబ్జీని గురించి ఆలోచిస్తుంది:

శోభ నిద్రపోయే బాబ్జీతో పాటు తను వెళ్ళబోయే స్థితిని గురించి ఆలోచిస్తుంది—

ఇప్పటి గాలుల్ని పీలుస్తూ వెనుకలో బ్రతికే నాన్న బ్రతికున్న శోభను గురించి ఎప్పుడూ ఆలోచించడు.

తను మాత్రం ఈ ఆలోచనలన్నింటికంటే భిన్నంగా....

## 2

అరుంపాతిక డాబాకు అటూ ఇటూ వరండా వుంది. ముందో చిన్న పెంకుటి చావడి. చావిడికీ, ఇంటికీ మధ్యలో వేప చెట్టు ఒకటి నిటారుగా పైకి పెరిగి తన ఎర్రని చిగురుటాకు కళ్ళతో గాలికటూ ఇటూ ఊగుతూ డాబా పై భాగాన్ని చూస్తుంటుంది.

ఇంటి యజమాని వెంకట్రామయ్యగారికి అరవై సంవత్సరాలు దాటాయి. ఎర్రగా. ఆరోగ్యంగా ఉంటాడు. ఆయన భార్య పగడమ్మ ఇద్దరు కొడుకులతో, పదెకరాల పొలంతో, పాడి గేదెలతో, భర్తతో, పెత్తనంతో ఆ ఇంటి చుట్టూ వున్న ప్రహరీ లోపల అటూ ఇటూ తిరుగుతుంది.

పెద్దవాడు రాము-రెండోవాడు సుధీర్.

ఊళ్ళో ఉన్న హైస్కూల్లో ఉన్నవరకూ చదివి మానేశాడు రాము! తండ్రికి వ్యవసాయం భారమయ్యేసరికి, ఉద్యోగాలు చదువుకున్నవాళ్ళకు దూరమయ్యేసరికి తనిక చదవనని మానేశాడు.

విజ్ఞానం విద్యకు ఆశయం అయితే తను చదివిన వరకు చాలనుకున్నాడు. విద్యకు ఉద్యోగం చివరి మెట్టయితే- బ్రతకటానికి తనకద అవసరం లేదనుకున్నాడు.

అతని అభిప్రాయాలకు తండ్రి సరేనన్నాడు.

సుధీర్ మాత్రం. సుదీర్ఘమే అయినా తను చదువును కొనసాగిస్తానన్నాడు.

అందుకూ ఇంట్లో అంతా సరేనన్నారు.

* * *

వసంతం రాకను సూచిస్తూ ఎక్కడో కోయిల కూసింది. వేపచెట్టు ఉగాది పూలు పూసింది.

పగడమ్మ పచ్చడి చేసింది.

చేదు-తీపి. పులుపు-మిశ్రమం చేసింది.

ఒకే రుచి తిండి కాదు

ఒకే రంగు పూలకు లేదు.

ఒకే తీరు జీవితం పోదు.

పగడమ్మ ఆలోచించింది.

రాము పెరిగి పెద్దవాడయ్యాడు. చేదులాంటి బాధ్యతలే కాకుండా తీపిలాంటి హక్కులిన్ని కూడా వాడికి పంచాలి. వివాహం చెయ్యాలి.

పేరయ్య తెచ్చిన పెళ్ళి సంబంధాలన్నింటినీ పరిశీలించింది. చివరికి ఎన్నిక చేసింది. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రక్క వూరు- పరంధామయ్యగారి పెద్ద కుమార్తె సునీత.

ముక్కుబారుగా. ముఖం కోలగా.

చిక్కగా. అవయవాలన్నీ చక్కగా.

అందంగా. మధురోహల చందంగా.

కోడలుగా పగడమ్మ గడపదాటింది- వగడమ్మ పొంగి పోయింది.

తొలిమలుపు జీవితం తీపిని తృప్తిగా అనుభవించాక రాము కొడుక్కి తండ్రయ్యాడు. తరాల పరిణామక్రమంలోని ఒక చిన్ని యజ్ఞాన్ని ముగించి. సునీత తన స్త్రీత్వానికి పూర్ణత్వాన్ని సాధించుకుంది!

ఈలోగా చెట్లు ఆకులు రాల్చాయి. ప్రకృతిఆస్థానపాటగత్తె కోయిలమ్మ వచ్చుగనాన్ని వెదుక్కుంటూ ఎటో వెళ్ళిపోయింది. పొదలమీద పూలు లేక-బ్రతుక్కి మకరందం రాక తుమ్మెదలు 'ఝుం' అనడం మానేశాయి. ఆకాశంలో హరివిల్లు లేదు. ఆవిరుల్లాంటి వానతుంపరలు లేవు—మేఘాలు లేవు—ఎక్కడా పరవశం రాగాలు లేవు. పచ్చదనం మాడిపోయింది— భూమి నెర్రబారింది.

# శోభ

బొర్లిముంత నాగేశ్వరరావు

ఎండమావుల అలల్లోంచి వేడిగాలి బయటికొచ్చింది.

బ్రతుకు బట్టను నేసే నేతగానికి తడిలేనిగాలికి ఓ దారం తెగి పోయింది.

సునీతకు ఎపెండిసైటిస్ అయింది. వైద్యుని చేరిక ఆలస్యం అయింది.

ఆ రాత్రి ఆకాశంలో వాతావరణాన్ని దూసుకుపోయిన ఉల్క—మెరుపులా మెరిసి. బొగ్గులా మారి నేలమీద కూలి పోయింది!

తల్లి లేని పసివాడు.

దురదృష్టంచేతిలో జీవితంతెర రెండుముక్కలయిన రాము-

కోడల్ని కోల్పోయిన పగడమ్మ-

ముగ్గుల్ని కోల్పోయిన ముంగిలి-

పోషణ కోల్పోయిన పూల చెట్లు-

ఇల్లంతా ఒక్కసారి బావురుమంది! బ్రతుకు ఆకాశం కావురుకమ్మింది! కర్తవ్యం చీకటిగా మిగిలిపోయింది.

* * *

పగడమ్మ అర్థించినదానికి పరంధామయ్య కాదనలేదు—పరంధామయ్య సూచించినదానికి "శోభ" లేవనలేదు. శోభ సునీతకు చెల్లెలు!

కాలేజీలో చదువుతూంది! అంతరంగంలో మంచిచెడ్డల్ని బేరీజు వేసుకుని. అక్క స్థానాన్ని స్వీకరించింది!

కలం తిరిగిన చేతిలోకి కతిపీట తీసుకుంది. పుస్తకాలు మోసిన చంకలోకి పిల్లవాడ్ని తీసుకుంది. జాలీగీతాల నోటితో జోల పాటల్ని పాడింది.

కూతురుగా తండ్రిముందు మారాం చేసి. కోడలుగా బరువుగా. బాధ్యతగా మాట్లాడింది.

పరిధులు లేని విజ్ఞాన వేదికల ప్రాంగణాల్లోంచి ప్రహరీలున్న ఓ ఇంటి ముంగిల్లోకి ఒదిగిపోయింది. పరిశోధనల విజ్ఞాన పరిష్వంగం నుంచి మనసును మళ్ళించి. ప్రేమ పరిష్వంగంలోకి మనిషిని మళ్ళించింది.

శోభగా వికసించాల్సిన తను ఓ ఇంటికి శోభై వచ్చింది.

స్నేహితులు త్యాగమన్నారు.

తండ్రి కర్తవ్యమన్నాడు.

అత్తగారు తన అదృష్టమంది.

భర్త తన జీవన భాగ్యమన్నాడు.

బుజ్జిగాడు పెరిగి శోభను "అమ్మా" అన్నాడు.

అమ్మకాని అమ్మ పొంగిపోయింది. అమ్మైన అమ్మ పొంగిపోయింది.

అమ్మను తెచ్చిన నాన్న పొంగిపోయాడు!

* * *



కాలం కాస్త ముందుకు పోయింది!

ఆ రోజు రాము పట్నం నుంచి వస్తున్నాడు. ట్రంకురోడ్డు నల్లగా త్రాచుపాములా మెలికలు తిరిగింది. సైకిలు త్రొక్కుతుంటే చల్లగాలి హాయిగా వుంది.

సంధ్య దాటి చీకటిపడింది.

హెడ్‌లైట్స్‌తో ఎదురుగా వచ్చే లారీలు గుడ్లగూబల్లా ప్రక్కనే దూసుకుపోతున్నాయి. అవి వేసే హారన్స్ తలతిక్కలో అరిచే నక్కకూతల్లా వినిపిస్తున్నాయి.

రాము సైకిలు తొక్కుతున్నాడు.

ఎదురుగా ఎర్రగా చంద్రబింబం. తూర్పు ప్రసవించిన రక్తం ముద్దలా కనిపిస్తుంది.

తూర్పున ఎర్రగా లావుగా ఎందుకుంటుంది?

నెత్తిపైన తెల్లగా చిన్నగా ఎందుకుంటుంది?

రాము ఆలోచించటం మొదలెట్టాడు. ఎప్పుడో మాస్టారు చెప్పింది లీలగా మెదిలింది.

యానక చౌధంలో కాంతికిరణం వక్రీభవనం చెందినప్పుడు-

అవునవును-కిరణం కూడా వంపు తిరుగుతుంది.తనుపోయే రోడ్డు వంపు తిరుగుతుంది. ఆకాశం ఎదురుగ్గా వంపుతిరుగుతుంది.

పగలు కనిపించే సూర్యుడూ, రాత్రి కనిపించే చంద్రుడూ, చుక్కలూ అన్నీ వంపు తిరిగి కనిపించకుండా మాయమైపోతాయి.

రాము నవ్వుకున్నాడు.

రోడ్డు వంపుతిరిగింది. ఎదురుగ్గా వస్తున్న లారీ ఒకటి వేగంగా వంపు తిరిగింది.

రాము జీవితం మనసులో వున్న ఊహలమాదిరిగానే లారీ క్రింద వంపు తిరిగింది!

కాలం విరసాత్మకమయ్యింది!

మరోసారి—

మంగళాకాళ సౌధాంతంలో —కారు చీకట్లరాసులిన్ని గుమ్మరించింది.

శోభ వెలవెల పోయింది!

## 3

శోభ వెళ్ళిపోతుంది—

సూట్‌కేసు చేతికి తీసుకుంది. అమ్మ ఎంత నిర్దయురాలు! అన్న బ్రతికుండంగా శోభరాక అదృష్టముంది.

కాలం కాటేసినప్పుడు శోభ రాక అపశకునం అంది.భరించ లేని శోభ వెళ్ళిపోతుంది.

భరించేవాడు లేక శోభ వెళ్ళిపోతుంది!

కాలం కర్కశత్వాన్ని ఎదుర్కోవటానికి కాలేజీ చదువును మానేసిన శోభ—

ఈ ఇంటి కన్నీటిని తుడవటానికి తన లేచిగురాకు హస్తాల్ని ముందుకు సాచిన శోభ—

తనే కర్కశత్వం కోరలకు చిక్కుకుని. కన్నీటితో వెళ్ళిపోతుంది. శోభ వెళ్ళిపోతుంది!

ఇక్కడి జీవితాల వెలితిని నింపటానికి వచ్చిన శోభ వెలితిగా వెళ్ళిపోతుంది.

వచ్చగా వచ్చిన శోభ తెల్లగా వెళ్ళిపోతుంది!

నవ్వుతూ వచ్చిన శోభ ఏడుస్తూ వెళ్ళిపోతుంది!

త్యాగమే తనైన శోభకు త్యాగం కరువై వెళ్ళిపోతుంది. ఓదార్చిన శోభకు ఓదార్పు లేక వెళ్ళిపోతుంది.

వెళ్తూ వెళ్తూ శోభ "వెళ్ళొస్తాను మామగారూ" అంది.

"వెళ్ళు" అన్నాడు నాన్నగారు.

వెళ్తూ వెళ్తూ శోభ "వెళ్ళొస్తాను అత్తగారూ"అంది."వెళ్ళు" అంది అమ్మ.

వెళ్తూ వెళ్తూ శోభ "వెళ్ళొస్తాను మరిదిగారూ" అంది.

"నో.... వద్దు శోభా వద్దు. నన్ను అనామకుడ్ని. అవి వేకిపీ చెయ్యవద్దు. త్యాగం నీవంతే కాదు. నా వంతు కూడా వుంది. కన్నీటిని నీవే కాదు- నేనూ తుడవగలను.

అమ్మా, నాన్న ఏమన్నా సరే....అవని క్రుంగిపోయినా సరే—ఈ పట్టుకుంటున్న నీ చేతిని వదలను. వెలుగూ చీకటీ, నవ్వూ ఏడుపూ,సుఖమూ చావూ అన్నీ నీతోనే—ఇది నా నిర్ణయం శోభా—ఐ లవ్ యూ, ఐ వాంట్ యూ—" తను ధీరత్వంగా....సుధీరత్వంగా అన్నప్పుడు. శోభ కన్నుల్లో వేయికాంతులు!

